సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



కబ్జా కోరల్లో కొత్త చెరువు..!

మహేశ్వరం మండలం సిరిగిరిపురంలోని కొత్త చెరువును రియల్ వ్యాపారులు ఆక్రమించేందుకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. 8లో▸



అసైన్డ్ భూముల ప్రక్షాళన

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో అసైన్డ్ భూముల ప్రక్షాళనకు రెవెన్యూ అధికారులు శ్రీకారం చుట్టారు. 8లో▸

నేడు ఓయూ బంద్

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్‌డీ ప్రవేశాలకు యూజీసీ నిబంధనల పేరుతో వీసీ ప్రొ.రవిందర్ వ్యవహరిస్తున్న మొండివైఖరికి నిరసనగా సోమవారం ఓయూ బంద్ నిర్వహించనున్నట్లు ఐక్య విద్యార్థి సంఘం నాయకులు ఆదివారం పేర్కొన్నారు. క్యాంపస్‌లోని కాలేజీలు, కార్యాలయాల బంద్‌కు విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు సహకరించాలని కోరారు.

న్యూస్‌రీల్

అర్హులకు ఇళ్ల స్థలాలివ్వాలి

కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

తుర్కయంజాల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ అన్నారు. తుర్కయంజాల్‌లో ఆదివారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి. కిషన్ అధ్యక్షతన ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి ఏళ్లుగా ఇక్కడే స్థిరపడ్డారని.. నేటికీ కిరాయి ఇళ్లలో ఉంటూ అద్దె చెల్లించలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేయాలని, ఈనెల 9న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పగడాల యాదయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు రామకృష్ణా రెడ్డి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్, ఐద్వా జిల్లా కార్యదర్శి సుమలత, నాయకులు జగదీశ్, టి.నర్సింహ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

90 శాతం పూర్తయిన దక్కన్ భవనం కూల్చివేత

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్‌లో ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయిన దక్కన్ భవనం కూల్చివేత మరో 10 శాతం మాత్రమే మిగిలి ఉంది. గత నెల 19న ఆరంతస్తుల భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గల్లంతు కావడం తెలిసిందే. గతనెల 26 నుంచి కూల్చివేతలు చేపట్టారు. ఆదివారంవరకు భవనం 90 శాతం కూల్చివేతలు పూర్తయ్యాయి. మరో 10 శాతం మిగిలింది. ఈ 10 శాతాన్ని సోమవారం రాత్రి వరకు కూల్చివేస్తామని అధికారులు తెలిపారు.

వేడి నీటిలో పడి 19 నెలల చిన్నారి మృతి

మియాపూర్: వేడి నీటిలో పడి 19 నెలల చిన్నారి మృతి చెందిన విషాదకర ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అంగూర్ నాయక్, సుమిత్ర దంపతులు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి హఫీజ్‌పేటలోని మార్తాండనగర్ కాలనీలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అంగూర్ నాయక్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 3వ తేదీన సాయంత్రం సమయంలో స్నానం చేసేందుకు బాత్రూం వద్ద బకెట్‌లో వేడి నీళ్లు పెట్టి వెళ్లాడు. అతని వెంట వచ్చిన పెద్ద కూతురు నిహారిక (19 నెలలు) ప్రమాదవశాత్తు వేడి నీటిలో పడిపోయింది. దీంతో చిన్నారి ఒళ్లంతా కాలిపోయింది. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిహారిక ఆదివారం మృతి చెందింది. మియాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊ అంటారా.. ఊహూ అంటారా?

పేదల 'డబుల్' కల నెరవేరేనా..

- ఇప్పటికీ 'ఆసరా' కొందరికే..
- బీసీలకు త'రుణం' దక్కేనా..?
- రుణమాఫీతో రైతుకు హ్యాపీ కలిగించేనా!
- ఆశల పలకులో దళితులు
- అస్తవ్యస్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు
- అధ్వానంగా అంతర్గత రోడ్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ
- రాష్ట్ర బడ్జెట్‌పై గంపెడాశలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఐటీ ఎగుమతులు, భూములు, ఇళ్ల విక్రయాలు, మద్యం, మాంసం, పెట్రోల్, డీజిల్ అమ్మకాల ద్వారా జిల్లా నుంచే ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతోంది. శరవేగంగా పట్టణీకరణ జరుగుతున్నా.. ఆశించిన స్థాయిలో మౌలిక సదుపాయాలు సమకూరడం లేదు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉంది. భారీ వర్షాలు, వరదలకు లోతట్టు ప్రాంతాలు నీట మునగక తప్పడం లేదు. శివారు మున్సిపాలిటీల్లో ఎస్‌ఆర్‌డీపీ పథకం కింద కొన్ని పనులు చేపట్టినా.. సకాలంలో నిధులు చెల్లించకపోవడంతో ఏళ్ల తరబడి పనులు సాగుతున్నాయి. సోమవారం అసెంబ్లీలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో జిల్లాపై వరాల జల్లు కురిపిస్తారో.. రిక్తహస్తం చూపిస్తారో వేచి చూడాలి.

'పంచాయతీ' పరిష్కరిస్తారా?

జిల్లాలో 558 పంచాయతీలు, 13 మున్సిపాలిటీలు, మూడు మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. భూముల అమ్మకాలు, ఇళ్ల నిర్మాణాలు, ఐటీ అనుబంధ సంస్థలు, పారిశ్రామికవాడల ఏర్పాటుతో ప్రభుత్వానికి వీటి ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతోంది. వీటికి కొంత కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో ఆయా స్థానిక సంస్థలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. వీధిలైట్లు, పారిశుద్ధ్య పనులు, నర్సరీల్లో మొక్కల పరిరక్షణ, ట్రాక్టర్ కోసం బ్యాంకులో తీసుకున్న అప్పులు, డీజిల్ ఖర్చులు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, ఇతర నిర్వహణ పనుల కోసం సర్పంచ్‌లు అప్పు చేయాల్సిన పరిస్థితి.

గూడు గోడు తీరేనా?



ప్రభుత్వం 2016–17లో జిల్లాకు 6,777 ఇళ్లకు పాలనా అనుమతి ఇచ్చింది. ఇందుకు 274.35 ఎకరాల భూమిని కేటాయించింది. వీటిలో 6,637 ఇళ్ల నిర్మాణానికి టెండర్లు పిలవగా ఇప్పటి వరకు 2,445 మాత్రమే తుది దశలో ఉన్నాయి. మిగిలిన వాటిలో ఎలాంటి పురోగతి లేదు. తుది దశలో ఉన్న ఇళ్ల పంపిణీకి లబ్ధిదారులను కూడా ఎంపిక చేసింది. డ్రైనేజీ, వాటర్, విద్యుత్ పనులు పూర్తికాకపోవడంతో పంపిణీ నిలిచిపోయింది. ఇందుకు రూ.20 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇటీవల రూ.10 కోట్లు కేటాయించగా మరో రూ.10 కోట్లు రావాల్సి ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లోనైనా వీటికి నిధులు కేటాయిస్తారో, లేదో వేచి చూడాల్సిందే. ఖాళీ స్థలాలున్న వారికి రూ.3 లక్షల ఆర్థికసాయం అందజేయనున్నట్లు ఇటీవల ప్రకటించింది. ఈ బడ్జెట్‌లోనైనా దీనికి మోక్షం కలుగుతుందో లేదో చూడాలి.

నిధుల్లేక నీరసించిన 'మన ఊరు మనబడి'



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఊరు– మనబడి' పథకానికి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. అప్పు చేసి పనులు పూర్తి చేసిన తర్వాత బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుండడమే ఇందుకు కారణం. జిల్లాలో 1,309 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో తొలి విడతగా 464 స్కూళ్లను ఎంపిక చేసి రూ.97.88 కోట్లు కేటాయించారు. ఇప్పటి వరకు 30 స్కూళ్లలోనే పనులు పూర్తయ్యాయి. అదీ రంగులు, ఫర్నిచర్, ఎలక్ట్రిసిటీ, తాగునీరు వంటి పనులే జరిగాయి. అదనపు గదుల నిర్మాణం, కిచెన్, ఇతర కీలక పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రూ.35 లక్షలకుపైగా వర్కులు ఉన్న స్కూళ్లకు టెండర్లు పిలిస్తే.. కాంట్రాక్టర్ల నుంచి స్పందన లేదు.

ఆ 'రుణం' ఈసారైనా తీర్చేనా?



2014 నుంచి 2018 డిసెంబర్ 11లోపు బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వడ్డీతో కలిపి ఒక్కో కుటుంబానికి రూ.లక్ష రుణమాఫీ చేయనున్నట్లు తెలిపింది. మొదటి విడతలో రూ.25 వేలలోపు రుణాలున్న 10,940 మందికి రూ.16.73 కోట్లు, రెండో విడతలో రూ.50 వేలలోపు రుణాలున్న 24,013 మందికి రూ.82.49 కోట్లు మంజూరు చేసింది. మూడు, నాలుగో విడత రుణాల మాఫీని వి స్మరించింది. పాత రుణాలను మాఫీ చేయకపోవడంతో.. కొత్తగా రైతులకు అప్పు పుట్టడం లేదు.

వీటి పరిస్థితి ఏమిటో..?

- కోహెడలో రూ.450 కోట్ల అంచనా వ్యయంతో 178 ఎకరాల్లో నిర్మించతలపెట్టిన పండ్ల మార్కెట్‌కు ఇప్పటి వరకు పైసా విడల్చలేదు.
- కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ ఆవరణలో 12 అంతస్తుల్లో రూ.900 కోట్లకుపైగా నిధులతో నిర్మించతలపెట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసి ఆరు నెలలైంది. నిధులు విడుదల చేసినా ఇప్పటి వరకు పునాది రాళ్లు కూడా పడలేదు.
- వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా 2017–18 వరకు సబ్సిడీపై రైతులకు అందించిన యంత్రాలు, డ్రిప్‌లు, విత్తనాలు, ఎరువులను ఆ తర్వాత నిలిపివేశారు. ఈ బడ్జెట్‌లోనైనా వాటి ప్రస్తావన ఉంటుందా అనేది వేచి చూడాల్సిందే.
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లోని 84 గ్రామాల అభివృద్ధికి అడ్డంకిగా మారిన 111 జీఓను గత అసెంబ్లీలో ప్రభుత్వం ఎత్తేసింది. దాని స్థానంలో జీఓ నంబర్ 69 తెచ్చినా ఇప్పటికీ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు.
- బీసీ సంక్షేమశాఖ ద్వారా స్వయం ఉపాధి పథకంలో భాగంగా నిరుద్యోగ యువతకు సబ్సిడీపై బ్యాంకులు రుణాలిచ్చేవి. మూడేళ్ల నుంచి ఒక్కరికి కూడా ఇవ్వలేదు. ఇటు బ్యాంకుల నుంచి సబ్సిడీ రుణాలు అందక, అటు ప్రభుత్వ ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువత ఇబ్బందిపడుతోంది.
- ఎస్టీ సంక్షేమశాఖ ద్వారా ఓనర్ కం డ్రైవర్ పథకంలో భాగంగా నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం సబ్సిడీపై వాహనాలు అందించేవారు. వేలాది మంది దరఖాస్తు దారులకు రెండేళ్లుగా ఎదురు చూపులు తప్పడం లేదు.
- జిల్లాలో 20 కేజీబీవీలుండగా ఏ ఒక్క దానికీ సొంత భవనం లేదు. దీంతో ఆయా విద్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కొందుర్గు మండలం పులుసుమామిడి, కడ్తాల్ మండలాల్లో చేపడుతున్న కేజీబీవీలకు సకాలంలో నిధులు కేటాయించకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.
- మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల ఆధ్వర్యంలో పని చేస్తున్న వసతి గృహాలదీ ఇదే పరిస్థితి.
- జిల్లాలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, వృత్తిదారులు, ఒంటరి మహిళలు, డయాలసిస్ పేషెంట్లు మొత్తం 2,07,639 మందిని ఆసరా పెన్షన్లకు ఎంపిక చేసింది. కొత్తగా ఎంపికైన వారికి కార్డులు జారీ చేసినా నిధుల లేమితో నెలవారీ డబ్బులు ఇవ్వడం లేదు.
- దళిత బంధు పథకం కింద మొదటి విడతలో నియోజకవర్గానికి వంద చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి ఆర్థిక సాయం అందజేశారు. రెండో విడత కోసం భారీగా దరఖాస్తు చేసుకున్నారు. నిధుల లేమితో ఇప్పటికీ ఆర్థిక సాయం అందలేదు.



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో పార్టీ నాయకులు

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని.. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా తీసుకెళ్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో మైసమ్మ ఆలయ ప్రారంభోత్సవంతో పాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, టీటీడీ బోర్డు సభ్యుడు కావేరి భాస్కర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేవాలయాలతో మనశ్శాంతి, ప్రశాంతత లభిస్తాయన్నారు. అనంతరం సర్పంచ్ మంజుల, మాజీ ఎంపీపీ అనిత శాలువాలు, పూలమాలలతో అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాహుల్, సురేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ మల్లేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జీవంతు, శ్యామ్‌రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తోల్‌కట్ట శ్రీనివాస్, బాకారం రాఘవరెడ్డి, అప్పోజిగూడ రాజు, కేతిరెడ్డిపల్లి శోభ, సుకన్య, గ్రామ నాయకులు శ్రీహరియాదవ్, రవియాదవ్, బిస నర్సింహ, జలల మల్లేశ్, రాఘవేందర్, శ్యామ్‌రావు, కట్టమీది ప్రకాష్, విఘ్నేష్‌గౌడ్ మాల యాదయ్య, నరేష్‌గౌడ్ మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి



ఆలూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: గ్రామగ్రామాన పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తల్లారం, ఆలూరు గ్రామాల్లో వారు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌పార్టీలకు చెందిన కార్యకర్తలు, యువకులు బీజేపీలో చేరారు. అనంతరం పార్టీ నేతలు మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు ఏకమై.. త్యాగాలు చేసి ప్రత్యేక రాష్ట్రం తీసుకువస్తే కేసీఆర్ కుటుంబానికి తప్ప ఎవరికీ లబ్ధి చేకూరలేదన్నారు. ప్రాజెక్టుల పేరు చెప్పి వేల కోట్లు వెనకేసుకున్నారని.. వాటిని కాపాడుకోవడానికే బీఆర్‌ఎస్ పెట్టారని ఆరోపించారు. ప్రభుత్వం చెప్పిన మాయమాటలు, ఇచ్చిన హామీలన్నీ ప్రజలకు గుర్తున్నాయని.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు కంజర్ల ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రామిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు అత్తెల్లి అనంతర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేశ్‌రెడ్డి, చేవెళ్ల బీజేవైఎం అసెంబ్లీ అధ్యక్షుడు అల్లా శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పత్తి సత్యనారాయణ, దళితమోర్చా అధ్యక్షుడు అశోక్, ఏబీసీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, బండారి శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తల్లారం ఆలూరు గ్రామాల బూత్ అధ్యక్షులు కుమార్‌గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డొక్కు బస్సులే దిక్కా?

- రోజురోజుకూ తగ్గిపోతున్న సర్వీసుల సంఖ్య
- సాయం కోసం గ్రేటర్ ఆర్టీసీ ఎదురుచూపులు
- విస్తరిస్తున్న మహా నగరం
- ఇంకా రోడ్డెక్కని 300 ఎలక్ట్రిక్ బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ఏడాదికోసారి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెడుతూనే ఉంది. ప్రతి సంవత్సరం ఊరించి ఉసూరుమనిపిస్తూనే ఉంది. ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో ఏళ్లకు ఏళ్లుగా కాలం చెల్లిన సిటీ బస్సులే నడుస్తున్నాయి. దశాబ్ద కాలంగా ఒక్క కొత్త బస్సు కూడా రోడ్డెక్కలేదు. మరోవైపు హైదరాబాద్ మహానగరం విస్తరిస్తోంది. ఔటర్‌కు వెలుపల సైతం వదలాది కాలనీలు వెలిశాయి. ఆయా కాలనీలన్నీ ప్రజా రవాణాకు దూరంగానే ఉన్నాయి. ప్రైవేట్ వాహనాలు, ఆటోలు, వ్యక్తిగత వాహనాలపైనే ఆధారపడి లక్షలాది మంది నగరవాసులు రోజువారీ రాకపోకలు సాగిస్తున్నారు. పొరుగున ఉన్న ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో ప్రజా రవాణా పరుగులు తీస్తుండగా హైదరాబాద్‌లో మాత్రం చతికిలపడటం గమనార్హం.

ఈ– బస్సులేవీ?

రెండేళ్లుగా ఎలక్ట్రిక్ బస్సులపై ఊరిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఒక్క సర్వీసు కూడా అందుబాటులోకి రాలేదు. అద్దె ప్రాతిపదికన ఈ బస్సులను నడిపేందుకు గతేడాది టెండర్ల ఆహ్వానించారు. కొన్ని సంస్థలు ముందుకొచ్చాయి. వాటిలో ఒక సంస్థ సాంకేతిక సామర్థ్యంపై అనర్హత కారణంగా టెండర్ల ప్రక్రియలో వివాదం చోటుచేసుకుంది. అనంతరం న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ వివాదం పరిష్కారమైనప్పటికీ ఇంకా ప్రతిష్టంభన తొలగిపోలేదు. దీంతో గతేడాది డిసెంబర్ నాటికే నగరంలోని వివిధ మార్గాల్లో సుమారు 300 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వస్తాయని భావించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు.

- ప్రస్తుతం గ్రేటర్‌లోని 28 డిపోల పరిధిలో సుమారు 2,850 బస్సులు ఉన్నాయి. వీటిలో కనీసం వెయ్యికిపైగా డొక్కు బస్సులే. కాలం చెల్లిన వీటితోనే ప్రయాణికులకు రవాణా సదుపాయాన్ని అందజేస్తున్నారు. ప్రతి రోజు సుమారు 22 లక్షల మంది ప్రయాణం చేస్తుండగా ఈ అరకొర బస్సులతోనే ఆర్టీసీ అధికారులు పాట్లు పడుతున్నారు. ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులను ఏర్పాటు చేయలేకపోతున్నట్లు విచారం వ్యక్తం చేస్తున్నారు. శివారు ప్రాంతాల్లోని కాలనీలకు రోజుకు 8 ట్రిప్పుల డిమాండ్ ఉంటే కేవలం 4 ట్రిప్పులే నడుపుతున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

6 వేల బస్సులు అవసరం..

రవాణారంగ నిపుణుల అంచనా మేరకు విస్తరిస్తున్న హైదరాబాద్ అవసరాల మేరకు ఇప్పటికిప్పుడు కనీసం 6 వేల బస్సులు కావాలి. ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి నగరాల్లో వేలకొద్దీ బస్సులు అందుబాటులో ఉన్నాయి. బెంగళూరులో నిత్యం 6వేల బస్సులు నడుస్తుండగా అదనంగా మరిన్ని కొనుగోలుకు చర్యలు చేపట్టారు. ముంబైలో ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు అందుబాటు లోకి వచ్చాయి. వాహన కాలుష్య నియంత్రణ కోసం ఢిల్లీలో సీఎన్‌జీ బస్సులను భారీ ఎత్తున కొనుగోలు చేసి నడుపుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో అందుకు విరుద్ధంగా బస్సుల సంఖ్య తగ్గిపోవడం గమనార్హం.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న బీఎస్పీ నాయకులు

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లింగం

షాద్‌నగర్‌రూరల్: విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లింగం అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఆదివారం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డిశ్రీనివాస్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లింగం మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు బహుజనులను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు పేదల కష్టాలను విస్మరించి స్వలాభమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో బీసీ కులాల లెక్కింపు చేపట్టాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పునః సమీక్షించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పేదలను చేర్చాలని డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, రాజ్యాధికారం కోసం బహుజన సమాజ్ పార్టీ అనేక పోరాటాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు అవలంబిస్తున్న మోసపూరిత విధానాలను ప్రజలకు వివరించేందుకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ షాద్‌నగర్‌లో పర్యటించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తట్టెపల్లి రాములు, ప్రశాంత్, దర్శన్, బాలయ్య, ఇంద్రసేన, కుమార్, శ్రీనివాస్, అనంతయ్య, హరికుమార్, రాధాకృష్ణ, కృష్ణ, నర్సింలు, యాదయ్య, శ్రీనివాస్, ఉదయ్, మల్లేష్, ఆంజనేయులు, జగన్, రామకృష్ణ, మోహనకృష్ణ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి 'ఖేల్ తెలంగాణ జీతో తెలంగాణ'

హిమాయత్‌నగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 'ఖేల్ తెలంగాణ జీతో తెలంగాణ' పేరుతో క్రీడా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం క్రీడలకు సంబంధించిన పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావుతో కలిసి హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 21, 22, 23 తేదీల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో పలు క్రీడలు నిర్వహించనున్నారని చెప్పారు. కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ (రన్నింగ్) వంటి క్రీడా విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. సమావేశంలో కృష్ణగౌడ్, సందీప్ సాయి, వనం రమేష్, సూర్య ప్రకాశ్ సింగ్ పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు

నందిగామ: మండలంలో వరుస దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. వారం రోజుల్లో రెండు చోట్ల దొంగతనాలు జరగ్గా తాజాగా శనివారం మండల కేంద్రంలో మరో దొంగతనం చోటుచేసుకుంది. నందిగామకు చెందిన ఓ వ్యక్తి తన బైక్‌ను శనివారం చౌరస్తాలో పార్క్ చేసి పని నిమిత్తం వేరే చోటుకి ఇతరుల వాహనంపై వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి తన బైక్ కనపడక పోవడంతో ఆందోళనకు గురయ్యాడు. దీంతో ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేవలం వారం రోజుల వ్యవధిలో మూడు చోరీలు జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన పోలీసులు స్పందించి పెట్రోలింగ్ సిబ్బందిని పెంచడమే కాకుండా దొంగలను పట్టుకొని కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వంతెన అడ్డంకులు తొలగాలని..

- చిలుకూరు బాలాజీ ఆలయానికి చిన్నమంగళారం వాసుల పాదయాత్ర
- పనులు ప్రారంభం కావాలని వేడుకోలు



శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్: కోర్టు కేసులతో నిలిచిపోయిన వంతెన నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోవాలని చిన్నమంగళారం గ్రామస్తులు చిలుకూరు బాలాజీ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అడ్డంకులు తొలగి త్వరగా వంతెన నిర్మాణ పనులు మొదలు కావాలని స్వామివారిని వేడుకున్నారు. మండలంలోని చిన్నమంగళారం వద్ద మూసీ వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5కోట్లు మంజూరు చేసింది. కొంత కాలం క్రితం పనులు మొదలయ్యాయి. తమ భూమిలో వంతెన నిర్మాణం చేయవద్దని ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లడంతో పనులు నిలిచిపోయాయి. కోర్టు వివాదం, ఇతర అడ్డంకులు తొలగిపోయి వంతెన నిర్మాణ పనులు మొదలు కావాలని గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ మరికొంత మంది గ్రామస్తులు ఆదివారం చిన్నమంగళారం నుంచి చిలుకూరు బాలాజీ దేవాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. అడ్డంకులు తొలగిపోయి, పనులు త్వరగా మొదలయ్యేలా చూడాలని స్వామివారికి పూజలు చేసి మొక్కుకున్నారు. సుందరేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో యువకులు శ్రీనివాస్‌గౌడ్, రజినీకాంత్‌రెడ్డి, శ్రీరామ్, వెంకటేష్, రాములు, గణేష్, నరేష్ పాల్గొన్నారు.

కాలుష్య రహిత జీవనమే లక్ష్యం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు, ఈషారెబ్బ, అనసూయ, చమ్మక్ చంద్ర

- అందుకే వీర్తుసా గ్రీన్ విండ్ ప్రాజెక్ట్
- వీర్తుసా లైఫ్ స్పేసెస్ సీఈవో వెంకటేశ్వర్లు

కడ్తాల్: అద్భుతమైన ప్రకృతి సౌందర్యం.. ప్రకృతి ప్రేమికుల డ్రీమ్ హోమ్ కోసమే వీర్తుస గ్రీన్ విండ్ ప్రాజెక్ట్ చేపట్టామని వీర్తుస లైఫ్ స్పేసెస్ సీఈవో వైగండ్ల వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఆదివారం కడ్తాల్ – తలకొండపల్లి మార్గంలో వీర్తుస గ్రీన్ విండ్ ప్రాజెక్ట్ వెంచర్‌లో సినీనటీమణులు ఈషారెబ్బ, అనసూయ, జబర్దస్త్ ఫేమ్ చమ్మక్ చంద్రతో కలిసి వెంకటేశ్వర్లు నూతన వెంచర్‌ను ప్రారంభించారు. అనంతరం బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలుష్య రహిత జీవనం, హైదరాబాద్ నగర శివారులో పెరుగుతున్న ఉపాధి అవకాశాలు దృష్టిలో పెట్టుకొని చాలా మంది పచ్చని చెట్లు ఉన్న ప్రాంతాలకు మకాం మార్చడానికి ఇష్టపడుతున్నారని తెలిపారు. అలాంటి వారి కోసమే ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం అనసూయ, ఈషారెబ్బ, చమ్మక్ చంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్ నాయక్, సంస్థ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల ప్రక్షాళనకు శ్రీకారం

- ధరణి పోర్టల్‌లో నకిలీల పేర్లు
- అర్హులకు అందని పట్టాదారు పాసుపుస్తకాలు
- ఫిర్యాదులతో ఫీల్డ్ విజిట్‌కు తహసీల్దార్
- నకిలీల్లో మొదలైన గుబులు



సుల్తాన్‌పూర్‌లో అసైన్డ్ భూముల పరిశీలకు వెళ్తున్న తహసీల్దార్

యాచారం: అసైన్డ్ భూముల ప్రక్షాళనకు రెవెన్యూ అధికారులు శ్రీకారం చుట్టారు. ధరణి పోర్టల్‌లో నకిలీ రైతుల పేర్లు నమోదు కావడంతో అర్హులకు అన్యాయం జరిగింది. పలు గ్రామాల్లో 1985నుంచి విడతల వారీగా భూ పంపిణీ చేసి పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. అయితే కబ్జాలో ఉన్న రైతుల పేర్లు ధరణి పోర్టల్‌లో నమోదు కాలేదు. నకిలీలు మాత్రం రెవెన్యూ సిబ్బంది, పైరవీకారుల సహకారంతో ధరణి పోర్టల్‌లో తమ పేర్లు ఎక్కించుకుని పట్టాదారు పాసుపుస్తకాలు పొందారు. దీంతో అర్హులైన రైతులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అప్పటి కలెక్టర్ అమయ్‌కుమార్ కలిసి విజ్ఞప్తి చేశారు. కొన్ని ఫిర్యాదుల ఆధారంగా యాచారం తహసీల్దార్ సుచరిత ఫీల్డ్ విజిట్ చేశారు. అర్హులకు అన్యాయం జరిగిందని గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో అసైన్డ్ భూముల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని అసైన్డ్ భూమి మొత్తాన్ని ఫార్మాసిటీకి తీసుకున్నారు. మిగిలిన 20 గ్రామాల్లో 6వేల మందికి పైగా రైతులకు 8 వేల ఎకరాలకు పైగా అసైన్డ్ పట్టాలిచ్చారు. ఆ పట్టాలు పొందిన రైతుల్లో దాదాపు 25 శాతం మేర పట్టాదారు పాసుపుస్తకాలు అందలేదు. ఏళ్లుగా తాము నిజమైన రైతులమని, తమకు న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరిగి ప్రాధేయపడినా ఫలితం లేకపోయింది.

భూ పంపిణీ చేసిన సర్వే నంబర్లు ఇవే..

మొండిగౌరెల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 19, 68, 127, యాచారం గ్రామ రెవెన్యూ పరిధిలోని 121, 126, 146, 191, చింతపట్ల గ్రామంలో సర్వే నంబరు 124, 284, నల్లవెల్లి గ్రామంలో సర్వే నంబరు 87, 45, 230, మంతన్‌గౌరెల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 21, 20, 117, కొత్తపల్లి గ్రామంలో సర్వే నంబరు 32,178, 182, 222, 242, 317, తక్కళ్లపల్లి గ్రామంలో సర్వే నంబరు 106, 107, 172లలో 8వేల ఎకరాలకు పైగానే అసైన్డ్ పట్టాలు అందజేశారు. కానీ గతంలో పనిచేసిన రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం, అక్రమాల వల్ల దాదాపు 350 ఎకరాలకు పైగా అసైన్డ్ పట్టా భూమి ధరణి రికార్డులో నమోదు కాలేదు. మంతన్‌గౌరెల్లి, సుల్తాన్పూర్, మంతన్‌గౌడ్, నల్లవెల్లి, మొండిగౌరెల్లి, తక్కళ్లపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ భూమి కంటే అదనంగా ధరణి పోర్టల్‌లో నమోదయ్యింది. అప్పట్లో నకిలీలకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు.

రైతుబంధు కోల్పోతున్న అర్హులు

రాష్ట్ర ప్రభుత్వం పంటల పెట్టుబడులకు గాను ఏడాదికి రెండు దఫాలుగా రైతుబంధు పథకం కింద ఎకరాకు రూ. 10 వేల అందజేస్తోంది. అసైన్డ్ పట్టాలున్న నిజమైన రైతుల భూ రికార్డులు ధరణి పోర్టల్‌లో నమోదు కాకపోవడంతో వీరికి 2018 నుంచి రైతుబంధు పథకం అందడం లేదు. దాదాపు 500 ఎకరాలకు పైగా భూమికి ప్రతియేటా రైతుబంధు పథకం అందడం లేదు. కబ్జాలో ఉన్నా పట్టాదారు పాసుపుస్తకాలు లేక పోవడంతో ఆ రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూమిని ఏ అవసరాలకు సేకరిస్తుందో తెలియక పట్టాదారు పాసుపుస్తకాలు వస్తాయో రావోననే బెంగతో రైతులు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు.

ఫీల్డ్ విజిట్‌తో నకిలీల్లో గుబులు

అసైన్డ్ భూముల ప్రక్షాళనకు తహసీల్దార్ సుచరిత నేరుగా ఫీల్డ్ విజిట్ చేస్తున్నారు. గ్రామాలకు కిలోమీటర్ల దూరంలో అసైన్డ్ భూములున్న, వాహనాలు వెళ్లని పరిస్థితి ఉన్నా కిలోమీటర్ల కొద్ది కాలినడకనే వెళ్లి అసైన్డ్ పట్టా భూములను పరిశీలిస్తున్నారు. 1985 నుంచి పలు విడతలుగా గ్రామాల్లో ఏ రైతులకు భూ పంపిణీ కింద అసైన్డ్ పట్టాలిచ్చారు. ఫలానా సర్వే నంబరులో ఎన్ని ఎకరాల వ్యవసాయ భూమి ఉంటే ఎన్ని ఎకరాలకు అసైన్డ్ పట్టాలిచ్చారు. పట్టాలు పొందిన రైతులే కబ్జాలో ఉన్నారా.. కబ్జాలో ఉంటే పట్టాదారు పుస్తకాలు వచ్చాయా, అసైన్డ్ భూ పంపిణీ సమయంలో సర్టిఫికెట్లు పొందిన దాంట్లో ఉన్న ఎకరాలే ధరణి పోర్టల్‌లో నమోదు కావడం జరిగిందా.. సర్వే నంబరులో ఉన్న భూమి కంటే అదనంగా ఎన్ని ఎకరాల నమోదయ్యాయి.. వంటి నకిలీల వివరాలు రాబడుతున్నారు. వారం రోజులుగా మంతన్‌గౌరెల్లి, మంతన్‌గౌడ్, సుల్తాన్‌పూర్ రెవెన్యూ పరిధిలోని అసైన్డ్ రికార్డుల ప్రకారం ఫీల్డ్ సర్వే చేయగా పలు అక్రమాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. ఫీల్డ్ విజిట్‌లో గ్రామస్తుల సమక్షంలో నిజమైన రైతులెవరు.. నకిలీలు ఎవరూ అనే విషయం బట్టబయలు చేయడం జరుగుతుంది. దీంతో నకిలీల్లో గుబులు పట్టుకుంది.

అధికంగా నమోదు కావడంతో..



సుల్తాన్‌పూర్‌లోని సర్వే నంబరులో 17లో మా తండ్రి బద్రుకు నాలుగు ఎకరాల అసైన్డ్ పట్టా ఉంది. మా తండ్రి పది ఏళ్ల కింద చనిపోయాడు. నాకు మా తమ్ముడు లక్ష్మణ్‌కు గతంలో మ్యాన్యువల్‌గా రెండు ఎకరాల చొప్పున పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చాయి. ధరణి పోర్టల్ రావడంతో మాకు మూడేళ్ల నుంచి పట్టాదారు పుస్తకాలు రాలేదు. పలు మార్లు అధికారులను కలిసినా ఫలితం లేదు. ప్రస్తుతం తహసీల్దార్ సుచరిత చొరవతో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పొందుతున్నాం.

– తావునాయక్, రైతు, సుల్తాన్‌పూర్

అర్హులకు న్యాయం చేయాలనే..



మండలంలోని పలు గ్రామాల్లో నిజమైన అసైన్డ్ దారుల పేర్లు ధరణి పోర్టల్‌లో నమోదు కాలేదు. ఈ విషయం రైతుల ఫిర్యాదులతో గుర్తించాం. కానీ పలు గ్రామాల్లో నకిలీల పేర్లు నమోదు చేశారు. అందుకే ఫీల్డ్ విజిట్ చేయాలని నిర్ణయించుకున్నా. పలు గ్రామాల్లో ప్రభుత్వ సర్వే నంబర్లలో ఉన్న భూమి కంటే అధికంగా ధరణి పోర్టల్‌లో నమోదైంది. అందుకే నిజమైన రైతుల భూ రికార్డులు నమోదు కాలేదు. ఫీల్డ్ విజిట్‌తో నిజమైన అసైన్డ్ దారులకు న్యాయం చేస్తా. నకిలీలు బయటపడితే రికార్డుల్లోంచి వారి పేర్లు తీసేస్తాం.

– సుచరిత, తహసీల్దార్ యాచారం

కబ్జా కోరల్లో కొత్త చెరువు..!

చెరువును పూడ్చేందుకు యత్నిస్తున్న రియల్టర్లు

- ఆక్రమణలు గుర్తించకుండా చుట్టూ మట్టి పోత
- రెవెన్యూ శాఖకు గ్రామస్థుల ఫిర్యాదు
- పూర్తిస్థాయి విచారణ చేస్తామంటున్న అధికారులు



మట్టి పోయడంతో కుచించుకుపోయిన చెరువు



సిరిగిరిపురం కొత్త చెరువు

మహేశ్వరం: హైదరాబాద్, అంతర్జాతీయ విమానాశ్రయానికి, ఔటర్ రింగ్ రోడ్డుకు అతి చేరువలో ఉన్న మహేశ్వరంలో భూములకు రెక్కలొచ్చాయి. దీన్నీ ఆసరాగా చేసుకొని కొంత మంది రియల్టర్లు కనిపించిన స్థలాలను కబ్జా చేస్తున్నారు. వారి అవసరాల కోసం ఏళ్లనాటి చెరువును కబ్జా చేసి మట్టితో పూడ్చి వెంచర్ ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నారు. ఇదెక్కడో కాదు.. మహేశ్వరం మండలం సిరిగిరిపురం గ్రామంలోని కొత్త చెరువును రియల్ వ్యాపారులు ఆక్రమించి దాన్ని మట్టితో పూడ్చేందుకు యత్నిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇది వరకు ఇక్కడ కొత్త చెరువు ఉండేదని, దాన్ని కబ్జా చేయరాదని వారితో వారించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. నగరానికి చెందిన కొందరు చెరువు పక్కన ఉన్న పట్టా భూమిని కొనుగోలు చేసి చెరువుతో పాటు వారి భూమి చుట్టూ సుమారు 12 అడుగుల ఎత్తు మట్టి పోసి చెరువు లోపల జరిగే పనులు బయట వారికి కనిపించకుండా సిమెంట్ ఫ్రీ కాస్ట్ నిర్మాణం చేశారు. దీంతో చెరువులో ఎలాంటి పనులు చేపట్టినా బయటి వారికి కనిపించవు. రియల్టర్లు చెరువు అలుగును కూల్చేసి రోడ్డు వేశారు. భారీ వర్షాలు కురిస్తే మహేశ్వరం నుంచి వరద నీరు సిరిగిరిపురంలోని కొత్త చెరువులోకి వస్తాయి. ఇక్కడి నుంచి మంఖాల్ చెరువులోకి, అక్కడి నుంచి రావిర్యాల పెద్ద చెరువులోకి నీరు చేరుతుంది. కొత్త చెరువు నిండితే సమీపంలోని వ్యవసాయ బోర్లలో భూగర్భజలాలకు కొదవ ఉండదు. సిరిగిరిపురంలో కొత్త చెరువు ఉందో లేదో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గుర్తించి చెరువు కబ్జాకు గురైతే కాపాడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అసత్య ఆరోపణలు సరికావు

తాము చెరువును కబ్జా చేయలేదు. పట్టా భూమిని చదును చేస్తున్నాం. ఈ ప్రాంతంలో కొత్త చెరువు అనేదే లేదు. గతంలో స్థల యజమాని భూగర్భజలాల కోసం చెక్ డ్యాం నిర్మించాడు. అంతేకాని ఇక్కడ చెరువు లేదు. తమ సొంత భూమిని చదును చేసుకుంటే తప్పేంటి. కావాలనే కొంత మంది చెరువును కబ్జా చేస్తున్నారని అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు.

– భూ యజమానులు, సిరిగిరిపురం

పనులను ఆపేశాం



మండలంలోని సిరిగిరిపురం కొత్త చెరువును పూడ్చుతున్నట్లు తమ సమాచారం అందింది. ఘటనా స్థలానికి రెవెన్యూ సిబ్బందిని పంపి పనులను ఆపాం. ఇరిగేషన్, హెచ్ఎండీఏ, గ్రామస్తుల నుంచి పూర్తి సమాచారం తీసుకొని విచారణ చేపడతాం. చదును చేస్తున్న వారి వద్ద ఏమైన పత్రాలు, రికార్డులు ఉన్నాయో తీసుకొంటాం. వాటి ఆధారంగా ఆ భూమి ఎవరిదో గుర్తించి చర్యలు తీసుకుంటాం.

– మహమూద్ అలీ, తహసీల్దార్, మహేశ్వరం

స్పాల ముసుగులో వ్యభిచారం

నాలుగు సెంటర్ల సీజ్...నలుగురిపై కేసు

బంజారాహిల్స్: స్పా ముసుగులో క్రాస్‌మసాజ్ చేస్తూ వ్యభిచార గృహాలుగా మార్చిన నాలుగు స్పాలపై బంజారాహిల్స్ పోలీసులు దాడులు చేసి నిర్వాహకులను అరెస్ట్ చేయడమే కాకుండా వ్యభిచారానికి పాల్పడుతున్న యువతులను పునరావాసకేంద్రాలకు తరలించారు. ఈ స్పాలన్నీ బంజారాహిల్స్ రోడ్ నెం.12 ప్రధాన రహదారిలో కొనసాగుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని కృష్ణ టవర్‌లో కొనసాగుతున్న ఔరం సెలూన్ అండ్ స్పా, రోడ్ నెం.12లోని హదర్వా హమామ్ స్పా, కిమ్తి స్పేర్‌లోని ఎఫ్2 లగ్జరీ థాయ్ స్పా, బంజారాగార్డెన్ బిల్డింగ్‌లోని హెవెన్ ఫ్యామిలీ స్పాలపై దాడులు చేశారు. మసాజ్ థెరపిస్ట్‌ల పేరుతో కొంత మంది యువతులను నియమించుకొని క్రాస్ మసాజ్‌కు పాల్పడుతూ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లుగా పోలీసుల దాడుల్లో తేలింది. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఈ సెలూన్ అండ్ స్పాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ఔరం సెలూన్ అండ్ స్పాలో థాయ్‌లాండ్ నుంచి ఐదుగురు యువతులను రప్పించి వీరికి మసాజ్ థెరపిస్ట్ అనే పేరు తగిలించి క్రాస్ మసాజ్‌కు పాల్పడుతున్నట్లుగా తనిఖీల్లో వెల్లడైంది. థాయ్‌లాండ్ యువతులను పునరావాస కేంద్రానికి తరలించి మేనేజర్ సమీర్‌పై కేసు నమోదు చేశారు. నిర్వాహకుడు జంగం సుధాకర్ పరారీలో ఉన్నారు. అలాగే హదర్వ హమామ్ స్పా మేనేజర్ యామిన్ జిలానీ, యజమాని భీమ్‌సింగ్‌లను కూడా అరెస్ట్ చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోకుండా కస్టమర్ ఎంట్రీ రిజిస్టర్ లేకుండా, జీహెచ్ఎంసీ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వీటిని కొనసాగిస్తున్నట్లుగా బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక శక్తికి తోడు ఆరోగ్య శక్తి అవసరం

శంషాబాద్ రూరల్: 'ఆరోగ్యవంతమైన దేశం వేగంగా ఆర్థికాభివృద్ధి సాధిస్తుంది..ప్రతి ఒక్కరికి ఆర్థిక శక్తితో పాటు ఆరోగ్యశక్తి కూడా అవసరం' అని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారతి ట్రస్టు ఆవరణలో కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. మంచి ఆరోగ్యం కోసం మన జీవన శైలిలో మార్పులు, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు ఎంతో ముఖ్యమన్నారు. యోగా, నడక, వ్యాయామంతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కాపాడుకోవచ్చన్నారు. రైతులు, యువత, మహిళల అభ్యున్నతికి సేవా దృక్పథంతో స్వర్ణ భారత్ ట్రస్టు చేపడుతున్న కార్యక్రమాలు అద్భుతమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమానికి ముందు ఆవరణలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు.

రవి కుమార్‌కు రెండు పతకాలు

సాక్షి, హైదరాబాద్: ఆలిండియా మాస్టర్స్ గేమ్స్‌లో స్విమ్మింగ్ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన ఎస్.రవి కుమార్ రెండు పతకాలు సాధించాడు. పురుషుల 30–34 వయో విభాగంలో బరిలోకి దిగిన రవి కుమార్ 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో (1ని:32 సెకన్లు) స్వర్ణ పతకం సొంతం చేసుకోగా... 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో (00.56 సెకన్లు) రజత పతకం దక్కించుకున్నాడు. గత డిసెంబర్‌లో జరిగిన తెలంగాణ మాస్టర్స్ స్విమ్మింగ్ టోర్నీలో రవి మూడు స్వర్ణ పతకాలు సాధించి ఆలిండియా మాస్టర్స్ గేమ్స్‌కు అర్హత సాధించాడు.